సాక్షి శ్రీకాకుళం

సోమవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2023



సెలవుల కాలం..

దసరా సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిపెట్టాలి. ప్రమాదాలకు దూరంగా ఉంచాలి.

- 8లో



భారీగా నాటుసారా స్వాధీనం

మందసలో భారీగా నాటుసారా బస్తాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సారా వెయ్యి లీటర్లు ఉంటుంది.

- 8లో

శిక్షణ శిబిరం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం దసరా సెలవుల శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి కథలు చదవడం, కథలు చెప్పడం, డ్రాయింగ్ తదితర అంశాల్లో పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం అర్బన్: దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి సిఫార్సు చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు లేవన్నారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఫిర్యాదులను మండల, జిల్లా విద్యా శాఖాధికారులుతో పాటు రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 0863 -2444270, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి 9013133636 అలాగే 1098 చైల్డ్ లైన్ కు,1092 కాల్ సెంటర్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

జాతీయ పోటీల్లో పలాస విద్యార్థిని ప్రతిభ



సాధించిన కాంస్య పతకంతో యామిని

కాశీబుగ్గ: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరుగుతున్న సౌత్‌జోన్ జాతీయ క్రీడాపోటీల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ ప్రాంతం నేతాజీనగర్‌కు చెందిన అడప యామిని రాణించింది. ఆదివారం జరిగిన 3000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం గెలిచింది. తండ్రి అడప కూర్మారావు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా తల్లి శకుంతల జీడి పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేసి కుమార్తె యామినిని చదివిస్తున్నారు. పలాస ప్రభుత్వ క్రీడా మైదానంలో కోచ్ కొణతాల రామారావు సారథ్యంలో గత కొంత కాలంగా శిక్షణ పొందింది. ఈమె ప్రస్తుతం పలాసలోని కణితీస్ ఐటీఐ కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. విద్యార్థినికి కొణతాల రామారావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ అభినందనలు తెలిపారు.

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు నక్క లలిత



నక్క లలిత

నరసన్నపేట: స్థానిక కోవెల వీధికి చెందిన నక్క లలిత గోవాలో ఈ నెల 25 నుంచి నవంబర్ 9 వరకూ జరగనున్న 37వ నేషనల్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐ.భాస్కరరావు, కొత్తకోట శ్రీనివాసరావు తెలిపారు. నేషనల్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 81 కేజీల విభాగంలో లలిత పాల్గొననుందని భాస్కరరావు తెలిపారు. జాతీయ పోటీల్లోనూ రాణించాలని స్థానికులు ఆకాంక్షించారు.

'వైద్యులు నిరంతరం పరిజ్ఞానం పెంచుకోవాలి'

శ్రీకాకుళం రూరల్: వైద్యులు నిరంతరం తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని హెల్త్ యూనివర్సిటీ వీసీ కె.బాబ్జి అన్నారు. భారతీయ వైద్య సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ విభాగం కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాగోలు, శ్రీకాకుళం ఆస్పత్రుల సంయుక్త నిర్వహణలో ఆదివారం జెమ్స్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఐఎంఏ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జెమ్స్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ముందుగా వర్చువల్ విధానంలో సదస్సును ప్రారంభించారు. తమ కళాశాల ద్వారా వైద్య సదస్సులు నిర్వహించడానికి ఎల్లప్పుడూ సహకరిస్తామన్నారు. డాక్టర్ కె.సుధీర్, సంస్థ నిర్వాహకులు రామ్మోహన్‌రావు, ఆద్విక్‌లు ప్రజలు ఉపయోగపడే వైద్య కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించడానికి రాగోలు వైద్య కళాశాలను నిత్యం అందుబాటులో ఉంచుతామన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఐఎంఏ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 10 మంది నిష్ణాతులైన వైద్యులు పలు అంశాలను వివరించారు.



ఐఎంఏ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు



కంచిలి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో దుర్గాదేవి విగ్రహాలు

అవతార వైభవం

ఊరూరా అమ్మ కొలువు దీరింది. దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో ఆలయాలతో పాటు మండపాలు కూడా అందంగా ముస్తాబయ్యాయి. తొలిరోజున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనాలకు అనుమతినిచ్చారు. తల్లిని తిలకించి భక్తులు పులకించిపోయారు.



శ్రీకాకుళంలో బాలత్రిపుర సుందరి అవతారంలో విజయదుర్గమ్మ



ఇచ్ఛాపురం: ప్రత్యేక అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు



పాతపట్నం: శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో నీలమణిదుర్గ అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో బాలత్రిపురసుందరి దేవి అలంకరణలో..

కొత్తమ్మ తల్లి.. మా కల్పవల్లి





కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు విద్యుత్ దీపాల అలంకరణ (ఇన్‌సెట్‌లో) కొత్తమ్మ తల్లి

- రేపటి నుంచి మూడురోజులు కొత్తమ్మ తల్లి జాతర
- ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- పక్కాగా ఏర్పాట్లు

టెక్కలి, కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల కల్పవల్లి.. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవం జరగనుంది. ఏటా ఎంతో ఆర్భాటంగా నిర్వహించే ఈ ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రత్యేక ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో పాటుదేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు రానున్నట్లు అంచనా మేరకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు నేతృత్వంలో ఈఓ వాకచర్ల రాధాకృష్ణ పర్యవేక్షణలో పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవ రావు, గ్రామస్తుల సహకారంతో మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

● స్థల పురాణం

కొత్తమ్మ తల్లి స్థలపురాణంపై ఓ కథ స్థానికంగా ప్రచారంలో ఉంది. 1925లో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతుంటారు. స్థానికులు చెప్పుకుంటున్న స్థల పురాణం ప్రకారం.. 1925 ప్రాంతంలో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన కమ్మకట్టు చినప్పలనాయుడు అనే వ్యక్తి ప్రతి గు రువారం గ్రామం సమీపంలో గల నారాయణవలస సంతకు వెళ్తుండేవారు. ఎప్పటి లాగే సంత ముగించుకుని ఎద్దుల బండిపై తిరిగి వస్తుండగా ఓ మహిళ అప్పలనాయుడును ఆపి కోటబొమ్మాళి వరకు తనను తీసుకువెళ్లాలని కోరింది. దీంతో అప్పలనాయుడు సరే అన్నాడు. ఆమె బండి ఎక్కి న తర్వాత బండి బాగా బరువెక్కింది. బండి కోటబొమ్మాళి పొలిమేరకు వచ్చాక ఆమె పట్నాయకుని వెంకటేశ్వరరావుకు చెందిన తోటలోకి వెళ్లిపోయింది. అలా కొంత దూరం వెళ్లి అదృశ్యమైంది. దీంతో అప్పలనాయుడు భయపడి వడి వడిగా ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి అప్పలనాయుడు నిద్రిస్తున్న సమయంలో కలలో మహిళ కనిపించి తాను పూసపాటి రాజులు కొలిచిన ఆదిశక్తినని, తనను కొత్తమ్మ తల్లిగా పూజించాలని సూచించింది. పట్నాయకుని వెంకటేశ్వరరావు తోటలో గల వేపచెట్టు, ముషిడికి చెట్టు కలిసి ఉన్న ప్రదేశంలో పుట్ట వద్ద తన శక్తి నిక్షిప్తమై ఉందని చెప్పడంతో అప్పటి నుంచి అదే ప్రాంతంలో పూజ లు చేయడం ప్రారంభించారు. ఏటా పోలాల అమావాస్య తరువాత వచ్చే నవరాత్రుల్లో సంబరాలు చేయాలని అమ్మ ఆదేశించింది. అప్పటి నుంచి ఏటా కమ్మకట్టు కుటుంబానికి చెందిన వారు అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత ఉత్సవాలు ప్రారంభిస్తున్నారు.



ఉత్సవాలకు సిద్ధమైన కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయం

లాభాల్లో చేయూత మహిళా మార్ట్‌లు

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్
- నరసన్నపేట మహిళా మార్ట్ పరిశీలన

నరసన్నపేట: శ్రీకాకుళంతో పాటు నరసన్నపేటలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులు లాభాల్లో ఉన్నాయని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తెలిపారు. నరసన్నపేటలోని మహిళా మార్టును ఆయన ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ రూ. 1.20 లక్షల మేరకు నరసన్నపేటలో వ్యాపారం చేస్తున్నారని సెప్టెంబర్ నెలలో నరసన్నపేట మహిళా మార్ట్ రూ. 2.40 లక్షల లాభాన్ని ఆర్జించిందని వివరించారు. అలాగే శ్రీకాకుళం మహిళా మార్ట్ కూడా రోజుకు లక్షా యాభై వేల పైబడి వ్యాపారం చేస్తోందని చెప్పారు. గత నెలలో రూ. 3 లక్షల వరకూ లాభాన్ని ఆర్జించిందని అన్నారు. ఈ రెండు మహిళా మార్ట్‌లు సక్సెస్ అయ్యాయని అన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఒక్కో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కోటబొమ్మాళి, పలాస, రణస్థలంల్లో ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరింత బాధ్యతగా మహిళా మార్ట్‌లు నిర్వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

సందేహాలు నివృత్తి చేసుకోండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచన



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల సామగ్రి భద్రత, ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోదాములను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్‌కర్, ఎస్పీ జీఆర్ రాధికలు ఆదివారం తనిఖీ చేశారు. సోమవారం నుంచి సుమారు 20 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీలను బెంగళూరు బీఈఎల్ ఇంజినీర్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ ఆదివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు తనిఖీలను చేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు ఈ తనిఖీలకు హాజరు కావాలని సమాచారం అందజేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రత, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొదట విడతలో వీవీ పాట్స్ 7080, కంట్రోల్ యూనిట్స్ 5831, బ్యాలెట్ యూనిట్స్ 7523 చేరుకున్నాయని ఈవీఎంల తనిఖీల నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించడం జరగదని, ఏర్పాటు చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేయాలని చెప్పారు. డిజిటల్ చేతి గడియారం , ఎయిర్ పాడ్స్ అనుమతించరని ఆయన వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఎలాంటి సందేహాలు ఉన్నా నిపుణుల వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు, డీటీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక బస్సులు సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్

శ్రీకాకుళం అర్బన్: దసరా పండగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ నడపనున్న ప్రత్యేక బస్ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, విశాఖపట్టణాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 20వ తేదీ నుంచి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సెలవులు ఇవ్వనున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ, గుంటూరు, ఒంగోలు, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాలకు శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి 9 బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో నుంచి 5 బస్సులు, టెక్కలి నుంచి 4 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలతోనే నడుపుతామని, ఎలాంటి అదనపు చార్జీలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్టీసీ టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, ఏడీసీ ఎంపీ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జట్టు

నరసన్నపేట: స్థానిక హనుమాన్ వ్యాయామ శాల వద్ద ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అండర్–19 విభాగంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. నాలుగు కేటగిరీల్లో నలుగురిని ఎంపిక చేశారు. 49 విభాగంలో దూబ హేమ శ్రీ, 64 కేజీల విభాగం గుజ్జల వర్షిత, 67 కేజీల విభాగంలో కె.లోకేష్, 62 కేజీల విభాగంలో కింజరాపు వినోద్‌లు ఎంపికయ్యారు. కర్నూలులో ఈ నెలాఖరున నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా కె.అప్పలరామయ్య, కె.దివ్యవాణి, ఎస్.అప్పన్న, మధుసూదనరావు వ్యవహరించారు.

డీపీ దేవ్‌కి ఘన సత్కారం



డి.పి దేవ్‌ని సత్కరిస్తున్న విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డీపీదేవ్‌ను విశ్రాంత రెవెన్యూ సంఘ ఉద్యోగులు ఆదివారం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత జేసీ రజనీకాంతారావు మాట్లాడుతూ రిటైర్ అయిన తర్వాత కూడా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగ సంఘానికి పదేళ్లు కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. విశ్రాంత రెవెన్యూ సమావేశం భవనం సాధించటంలో దేవ్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ జగన్‌మోహన్‌రావు, ఆర్.మోహనరావు బైరి రామకృష్ణ, డివి రమణ, వేణుగోపాల్, డి.చంద్రశేఖర్ (చందు), కాశీప్రసాదు, దాలినాయుడు, యస్.మోహనరావు, సురేష్, డిసెంబర్‌రావు, సూర్యనారాయణ మూర్తి, బంటుపల్లి రామారావు, సత్యం, లక్ష్మణమూర్తి, నూకరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన ఎస్.కృష్ణమోహనరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాయుడుబాబు (విశాఖ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ఎఫ్ అహ్మద్ (సాలూరు), అడిషనల్ సెక్రటరీగా ఎ.ఆంజనేయులు (ఎమ్మిగనూరు) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వైఎస్‌సీహెచ్ పెద్దిరాజు (సాలూరు), కె.శివాజీ (తుని), షేక్ కాజుద్దీన్ (గిద్దలూరు), వైవీ మోహన్ రంగ (తుని), కె.చెంచయ్య (అద్దంకి), మహిళా కార్యదర్శిగా జి.నీలిమ (యలమంచిలి), వై.కోటేశ్వరమ్మ (చీరాల), పి.అబ్దుల్లా బేగం (నంద్యాల), కోశాధికారిగా ఎస్.వెంకటేష్ (మచిలీపట్నం), పబ్లిసిటీ సెక్రటరీగా ఎ.శ్రీనివాసరావు (భీమవరం), జాయింట్ సెక్రటరీలుగా జె.గోవిందయ్య (యలమంచిలి), ఎస్వీ రమణ (తణుకు), ఎం.మాల్యాద్రి (కావలి), వి.గిరిధర్‌బాబు (మదనపల్లి), సాంస్కృతిక విభాగం కార్యదర్శి వి.నాగేశ్వరరావు (పెడన), లీగల్ అడ్వైజర్‌గా కె.సాయిరాం (కొవ్వూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సంఘం కార్యదర్శి ఎస్.షబ్బీర్ అలీ, కోశాధికారి శ్రీధర్, రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోగురాజు పాల్గొన్నారు.

అమ్మ అడుగిడిన వేళ

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ వారి సిరిమాను చెట్టును నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో గుర్తించగా తరలింపు కార్యక్రమం ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ వేడుకగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు తరలిరాగా జయజయధ్వానాల నడుమ, మేళతాళాలతో ఊరేగింపుగా సిరిమాను చెట్టును తరలించారు. అంతకు ముందు వేలాదిగా భక్తులు చెట్టు వద్దకు చేరుకున్నారు. వేకువ జాము నుంచి పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో జరజాపుపేట మార్మోగింది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

సెలవుల కాలం.. ప్రమాదాలకు ఆలవాలం

- సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిపెట్టాలి
- నదులు, చెరువుల్లోకి వెళ్లనీయకపోవడం ఉత్తమం
- షికారుకెళితే సూచనలు చేయాల్సిందే

ఎల్.ఎన్.పేట: దసరా సెలవులు వచ్చేశాయి. బడులన్నీ నిశ్శబ్దమైపోయి సందడంతా ఇంటి గడపలకు చేరింది. సెలవు రోజుల్లో పిల్లలు బోలెడు ప్లాన్స్ పెట్టుకుంటారు. అయితే సరదాగా గడుపుతూనే పిల్లలను ఓ కంట కనిపెట్టుకుని ఉండాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఈ సెలవుల రోజుల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతుంటారు. అలా కాకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

నీరు..కన్నీరు

వానలు పడడంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా నదులు, చెరువులు, కాలువల్లో నీరు కనిపిస్తోంది. పిల్లలు సెలవు రోజుల్లో ఈత కోసం సరదాగా వీటి వద్దకు వెళ్తుంటారు. ఈత వచ్చిన వారితో పాటు ఈత రాని వారు కూడా సరదాగా దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ ఉంటారు. అందుకే ఈతరాని వారిని చెరువులు, కాలువలు, నదులు, సముద్రం వంటి వాటికి దూరంగా ఉంచడమే మంచిది. తీరాల్లో ఆడుకునేంత వరకు ఓకే గానీ ప్రమాదకర రీతుల్లో ఈత నేర్చుకోవడం వంటి కార్యాలకు దూరంగా ఉంచాలి.

సెల్‌ఫోన్ వద్దే వద్దు..

చేతిలోకి సెల్‌ఫోన్ వచ్చిందంటే ఎన్ని గంటలు అలా గడిచిపోతాయో తెలీదు. అందుకే సెలవు రోజుల్లో పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూడాలి. సెల్‌ఫోన్ చూస్తే చూడనీలే అని పిల్లలను ఏకాంతంగా వదిలేయకూడదు. సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆటకుండా చూడాలి. ఆన్‌లైన్ ఆటల వల్ల కుటుంబం మొత్తం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఎక్కువ సమయం పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకపోవటం ఉత్తమం. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.



స్నేహితులతో బయటకు పంపిస్తే..

స్నేహితులతో బయటకు వెళ్లి ఆడుకోవడం షరా మామూలే. కానీ ఎవరితో వెళ్తున్నారు, ఎక్కడకు వెళ్తున్నారు అన్న విషయాలను మాత్రం కచ్చితంగా తెలుసుకోవాలి. వర్షాకాలం కావటంతో ఎక్కడ చూసినా చెత్త, చెదారం నిల్వతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి ఉంటాయి. వాటిల్లో పాములు, విష కీటకాలు పొంచి ఉంటాయి. ఇవి ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తాయి.

జాగ్రత్తలు తప్పనిసరి



సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్దనే ఎక్కువ సమయం ఉంటారు. వారు ఏం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారు. ఎవరితో వెళ్తున్నారు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఏం ఆడుతున్నారు, బెట్టింగ్‌లు ఏమైనా చేస్తున్నారా అన్ని విషయాలన్నీ తల్లిదండ్రులు తెలుసుకోవాలి. కోపంతో కాకుండా ప్రేమగా పిల్లలకు అర్థమయ్యేలా జరిగే లాభ నష్టాలు, ప్రమాదాలు గురించి వివరించారు. ఎక్కడికి వెళుతున్నా పిల్లలకు అర్థమయ్యేలా తగిన జాగ్రత్తలు చెప్పాలి.

– కె.కృష్ణప్రసాద్, ఎస్ఐ, సరుబుజ్జిలి

కొత్త విషయాలు నేర్పించాలి



సెలవుల్లో పిల్లలకు ఏవైనా కొత్త కొత్త విషయాలు నేర్పించాలి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. పిల్లలను తల్లిదండ్రులే ఎక్కడికైనా బయటకు తీసుకుని వెళ్లాలి. కొత్త ప్రదేశాలు చూపించి అక్కడి విశేషాలను తెలియజేయాలి.

– ఎన్.శ్రీనివాస్, ఎంఈఓ, కొత్తూరు

● కలాం.. సలామ్



మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాంకు విద్యార్థులు అపురూప నివాళులర్పించారు. పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి ఆయనకు అంజలి ఘటించారు. – కవిటి

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ఆవరణలో రెండు రోజుల నుంచి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు ఆదివారం రాత్రి గుర్తించారు. మృతదేహం దుర్వాసన వస్తుంటే స్థానికులు రైల్వే సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా మృతదేహం స్టేషన్ ఆవరణలోనే ఉన్నా రైల్వే అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జీఆర్పీ పోలీసులను వివరణ కోరగా రైల్వే ప్లాట్‌ఫాం, ట్రాక్ పరిధిలో మృతిచెందితే తమకు సంబంధం ఉంటుందని రైల్వే స్టేషన్ బయట వైపున లోకల్ పోలీసు ఆధీనంలో ఉంటుందని తెలిపారు. అయితే స్థానిక ఎస్ఐ వై.కృష్ణను వివరణ కోరగా రైల్వే స్టేషన్ ఆవరణ తమ పరిధిలోకి రాదని మెయిన్ రోడ్ భాగంలో గానీ ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా తమకు సంబంధం ఉంటుందని తెలిపారు.



శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం

‘రాష్ట్రస్థాయి పోరులో రాణించండి’



జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల క్రీడాకారులతో పి.వేణుగోపాల్, గాలి అప్పలగురువు, సంఘ ప్రతినిధులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాను విజయపథంలో నిలపడంతోపాటు జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపిక కావాలని రాష్ట్ర రెవెన్యూ సంఘం ఉపాధ్యక్షుడు పప్పల వేణుగోపాలరావు ఆకాంక్షించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వేదికగా ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు ఆదివారం ఉదయం ఇక్కడ నుంచి పయనమై వెళ్లాయి. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో వేణుగోపాలరావు మాట్లాడుతూ తుది వరకు క్రమశిక్షణగా, సమష్టిగా ఆడాలని క్రీడాకారులకు హితబోధ చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారులకు గత కొన్ని రోజులుగా శిక్షణ శిబిరాలను నిర్వహించి పోటీలకు అనువుగా తీర్చిదిద్దినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, జిల్లా కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రయాణ ఖర్చుల కోసం కలిదిండి వెంకటరామరాజు, ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన చెందిన వ్యాపారవేత్త గాలి అప్పలగురువు, తాడివలస పీడీ దవళ పెంటయ్య క్రీడా దుస్తులకు అవసరమైన చేయూతను అందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, సంయుక్త కార్యదర్శి ఎం.ఆనంద కిరణ్, ఎ.ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు. కాగా జిల్లా జట్లకు కోచ్, మేనేజర్లుగా పీడీ/పీఈటీలు అన్నెపు రాజగోపాల్(ఎస్ఎస్ఆర్ పురం), ఎస్ రామరాజు (ఎస్ఎస్ వలస), జి.మల్లేష్ (కేశవరావుపేట) వ్యవహరించనున్నారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ జూడో ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–19 జూడో ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వప్పంగి వేదికగా ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్రపోటీలకు ఎంపిక కావాలనే లక్ష్యంతో ఈ ఎంపికల్లో క్రీడాకారులు తమ శక్తియుక్తులను ప్రదర్శించారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని జిల్లా అండర్–19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చరణ్, పీడీ పైడి సునీత తెలిపారు. అంతకుముందు ఈ ఎంపికలకు జెడ్పీ హెచ్‌స్కూల్ వప్పంగి ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాకుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు క్రీడా ఎంపికల్లో క్రీడాకారులు క్రమశిక్షణగా, పట్టుదలతో ఆడుతూనే.. క్రీడాస్ఫూర్తిని కనబర్చాలని పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తిని కనబర్చి జిల్లాకు పతకాల పంట కురిపించాలని క్రీడాకారులకు సూచించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 28 నుంచి 30 వరకు అనంతపురం జిల్లా చిగిచెర్లలో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి అండర్–19 బాలబాలికల ఎస్‌జీఎఫ్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రటరీ చరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్, జూడో ఇన్‌స్ట్రక్టర్స్ ఎస్.చంద్ర శేఖర్ ఎ.తరుణ్ సీనియర్ జూడో క్రీడాకారులు పాల్గొన్నారు.



జూడో ఎంపికల్లో రాణించిన క్రీడాకారులతో సెలెక్టర్లు, హెచ్‌ఎం, పీడీలు

భారీగా నాటుసారా స్వాధీనం

- టీడీపీ మందస అధ్యక్షుడి సోదరుని వాహనంలో దొరికిన సారా

మందస:

మందస పోలీసులు భారీగా నాటుసారాను పట్టుకున్నారు. ఈ నాటుసారా తీసుకువస్తున్న వాహనం తెలుగుదేశం పార్టీ మందస పట్టణ అధ్యక్షుడి సోదరుడిదే కావడం విశేషం. స్థానిక ఎస్ఐ హరికృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ పట్టణ అధ్యక్షునిగా ఉన్న గార కృష్ణారావు తమ్ముడు పాపారావు బొలేరో వాహనాలతో వ్యాపారాలు చేస్తున్నారు. ఈ తరుణంలో పాపారావు వాహనంలో నాటుసారా రవాణా జరుగుతోందని పోలీసులు పసిగట్టారు. ఎస్ఐ హరికృష్ణతో పాటు పీసీలు కె.ఢిల్లేశ్వరరావు, శరత్‌లు చేపట్టిన ఆపరేషన్‌లో బొలెరో మాక్సిట్రక్‌తో మందస తీసుకువస్తున్న వెయ్యి లీటర్ల నాటుసారా బస్తాలు శనివారం వేకువజామున స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై పూర్తిస్థాయి వివరాలను సేకరించారు. మందస పట్టణంలోని కిల్లమ్మవీధికి చెందిన తెలుకల గణేశ్‌తో నాటుసారాను వాహనంతో తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. చీపి పంచాయతీ బొందికరి గ్రామానికి చెందిన సవర గోపి, సవర బలరాం, కృష్ణలతో వాహనంలో ఒడిశా సరిహద్దులోని చిన్నకోస్టా సమీపంలో వీరికి నాటుసారా అందించినట్లు సమాచారం. బొలెరో వాహనంతో పాటు నాటుసారా రవాణాకు సంబంధించి ఎస్కార్ట్‌గా వెళ్తున్న కూడా టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. గోపి, బలరాం, కృష్ణలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి గార పాపారావు పరారీలో ఉన్నాడని, నాటుసారా విలువ రూ.2.50లక్షలు ఉంటుందని ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.



బొలెరో వాహనంలోని నాటుసారా బస్తాలు

వమరవల్లి ఆలయంలో చోరీ

గార: వమరవల్లిలోని పోలమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. అమ్మవారి వెండి పాదాలు, కిరీటంను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి దూరంగా ఉన్న ఆలయం కావడంతో దొంగతనం జరిగినట్టు భావిస్తున్నారు. సీఐ సన్యాసినాయుడు పరిశీలించారు. మండలంలో ఇప్పటికే పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు పెట్టడం జరిగిందన్నారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఇప్పటికే నోటీసులిచ్చామని, బంగారం, వెండి వస్తువులు ఆలయంలో ఉంచవద్దని సూచించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

టెక్కలి రూరల్: స్థానిక జగతిమెట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీ పరిధి గంగుపేట గ్రామానికి చెందిన ఎస్.ఆదమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదమ్మ తన భర్త అచ్చయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై టెక్కలి వస్తుండగా.. జగతిమెట్ట సమీపంలో బొప్పాయిపురం గ్రామానికి చెందిన కె.రాంబాబు బైక్‌తో వెనుక నుంచి అచ్చయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆదమ్మకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం బాతుపురంలో ఆదివారం సాయంత్రం తెప్పల కుమారి (42) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుమారి కుటుంబ సభ్యులతో కలిసి అండమాన్‌లో వలస కూలీలుగా బతుకుతున్నారు. కొన్ని నెలల క్రితం జీడి పిక్కల సేకరణ కోసం స్వగ్రామం వచ్చారు. ఊరిలో సర్వే జరుగుతున్న నేపథ్యంలో అండమాన్ వెళ్లకుండా ఇక్కడే ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మృతురాలికి భర్త తెప్పల నీలకంఠేశ్వర్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఇంటికి రోజూ పాలుపోసే కుర్రాడు ఆదివారం తలుపు కొడితే ఎవరూ తీయలేదు. ఎంతసేపయినా ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారు అనుమానంతో ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి గల కారణాలు తెలియరాలేదు. అప్పటి వరకు సరదాగా అందరితో కలిసి ఉన్న కుమారి మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. అమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

‘విప్లవ సాంస్కృతిక ఉద్యమ వారసుడు అశోక్’

పలాస: ఉద్దానం ప్రాంతంలో గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి వారసుడు సాలిన అశోక్‌కుమార్ అని పలువురు వక్తలు కొనియాడారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాలిన అశోక్‌కుమార్ సంతాప సభ జరిగింది. రాపాక ధనరాజు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో అశోక్ కుటుంబ సభ్యులతో సహా పలువురు కళాకారులు, రచయితలు, కవులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు, గాయకులు ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కళారంగంలో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లాల్సిన అశోక్ ఒక రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అతని కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందజేశారు.



అశోక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు

భలే మంచిరోజు



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 1980–83 కాలంలో చదివిన వారు ఆదివారం మళ్లీ కలిశారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో 60 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహా కలుసుకుని సందడి చేశారు. తమ అధ్యాపకులు కేవీజే రాధాప్రసాద్, జి.త్రినాథస్వామి, ఎం.శంకరరావులను సన్మానించారు. – శ్రీకాకుళం కల్చరల్

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: టెక్కలి–మెళియాపుట్టి మార్గంలోని పాలసింగి గ్రామం సమీపంలో ఆదివారం కారు ఢీకొని సంతబొమ్మాళికి చెందిన కె.రామారావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామారావు ఐస్‌క్రీమ్ విక్రయిస్తూ జీవిస్తుంటారు. తన ఐస్‌క్రీమ్ బండిపై వెళ్తుండగా పాలసింగి వద్ద చాపర నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బండిని ఢీకొట్టి పొలంలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో రామారావుకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఘటనపై ఏఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కళ్లేపల్లిలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కళ్లేపల్లి, బైరి, కుందువానిపేట గ్రామాల్లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సంఘ సభ్యులంతా కలిసి గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంగు నరేంద్ర కుమార్, సూరాడ సూర్యం, ఎంపీటీసీ బాణ కిశోర్ కలిసి హ్యాండ్ వాషింగ్, శుభ్రత, పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు.

ముగిసిన జిల్లాస్థాయి డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



క్రీడాకారులతో కె.సాగర్, ఆకుల ప్రదీప్, జి.భీమారావు, సూరిబాబు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: లలిత హోండా జిల్లాస్థాయి ఓపెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ చాంపియన్స్‌గా షేక్ మహమ్మద్–చల్లా రేవంత్ (పలాస) జంట నిలిచారు. జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో లలిత హోండా జిల్లాస్థాయి డబుల్స్ (పురుషులకు మాత్రమే) షటిల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి 40 వరకు జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్స్ మ్యాచ్‌లో 13–15, 18–16, 15–07 తేడాతో మహమ్మద్–రేవంత్ జంట గేదెల మోహన్–బైరెడ్డి రాజేష్ (చాపర) జంటపై గెలిచింది. ఈ పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించిన డబుల్స్ జంటల నుంచి విన్నర్స్ వరకు రూ.20వేల నగదు బహుమతులు అందజేశారు. పెద్దపాడు రోడ్‌లో ఉన్న లలిత హోండా ఎండీ ఆకుల ప్రదీప్, శ్రీకాకుళంలోని లక్ష్మీ సింహాద్రి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్టనర్ జి.భీమారావు విజేతలకు నగదు బహుమతులతోపాటు అలాగే పోటీలకు హాజరైన క్రీడాకారులు, తల్లిదండ్రులు, నిర్వాహకులు, టెక్నికల్ అఫీషియల్స్‌కు భోజన ఏర్పాట్లను కల్పించేందుకు స్పాన్సర్‌షిప్‌ను అందించి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ మాట్లాడుతూ జిల్లాలో మరో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం తయారైన నెల రోజుల్లో జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తామని అన్నారు.